


# కానిస్టేబుల్ కామేశం

– ఓ. భువనేశ్వరి

ఎముకలు కొరికే చలిలో కానిస్టేబుల్ కామేశం బీటుకు బయలుదేరాడు. "వెధవ ఉద్యోగం... వెధవ్వుద్యోగమని...తూ... హాయిగా తన్ని పెట్టుకు పడుకోవలసిన వేళలో ఇలా వణుకుతూ తిరగటం ఖర్మ కాకుంటే మరేమిటి" అనుకున్నాడు పోలీస్‌స్టేషన్ బయట నిలబడి.

కానిస్టేబుల్ కామేశం పోలీస్ జాతిలో ఉండవలసిన వాడు కాదు. నిజంగానే ఖర్మకొద్దీ పడ్డాడనుకోవాలి.

తలకు మఫ్లర్ బిగించి కట్టుకుని, స్వెట్టర్‌ను సరిచూసుకుని సైకిల్ టైర్లలో గాలి పరీక్షించి చూసుకుని బయలుదేరాడు కామేశం.

చలి చీరేస్తుంటే...రోడ్లవెంట మనిషనేవాడొక్కడూ కన్పించటం లేదు. ఊపులో ఊపుగా కామేశం తన సైకిల్‌కి మంచి స్పీడుతో తొక్కుతున్నాడు.

అప్పుడప్పుడు ఎన్ని తిట్టుకున్నా కామేశం తన డ్యూటీని మాత్రం ఖచ్చితంగా చేస్తాడు. పైసాకి కక్కుర్తిపడే గుణం అతని రక్తంలో లేనట్టు నడుచుకుంటాడు. పైరవీలు రాజకీయాల జోలికి పోడు. అందుకేనేమో తన సర్వీసులో ఇంతవరకు ఒక్క మెమో కూడా అందుకోలేదు. అతని మంచితనం తెలిసి అందరూ ఉపయోగించుకునే వారే. ఈ రోజు బీటు డ్యూటీ నిజానికి 401 సుబ్బారావుది. కామెర్లు అయ్యాయని సెలవు పెట్టి నిన్ననే డ్యూటీలో చేరాడు. మానవత్వం కొద్దీ బీటు డ్యూటీ ఈ చలిలో చేయలేవని సుబ్బారావు వాపోతుంటే తనే తీసుకున్నాడు.

కామేశం సైకిలు జోరుగా చీకటిని చీల్చుకుంటూ వెళుతోంది. అలవాటైన రోడ్డే కనుక లైటుతో పనిలేకుండానే వెళ్ళిపోతున్నాడు కామేశం.

ఊరికి సెంటరొచ్చింది. బీటు బుక్కు తీసి సాక్షి సంతకం పెట్టించుకుని తిరిగి సైకిలెక్కాడు. ఇకపై సందుల్లోనుంచి పోవాలి. వేడి వేడి టీ త్రాగాలనిపించింది. అర్ధరాత్రి ఒంటిగంట... ఎవరిస్తారు. ముందుకు కదిలాడు కామేశం. ఇంట్లో ఇద్దరు పిల్లలూ, భార్య రాజ్యం గుర్తువచ్చి చిన్నగా నవ్వుకున్నాడు. ఇద్దరు పిల్లలతో సరిపెట్టి భార్యకు ఆపరేషన్ చేపించేశాడు. ఇంక్రిమెంటు కూడా ఇస్తున్నారు. ఆపరేషన్ జరిగాక భార్య రాజ్యం కాస్త ఒళ్ళుచేసి మునుపటికన్నా మరింత అందంగా కనిపిస్తూ మురిపిస్తోంది. రత్నాల్లాంటి బిడ్డలు. ఇవన్నీ తలుచుకుని తిరిగి తనలో తనే 'పోనీలే వాళ్ళైనా సుఖంగా వుంటే అదే చాలు. తాను చలిలో తిరిగినా నిప్పుల్లో దూకినా తన బిడ్డల కొరకేగా...

సందుల్లోనుంచి ఇలా ఆలోచిస్తూ వెళ్ళిపోతున్న కామేశానికి వింత శబ్దంతో మూలుగు వినిపించింది. అతని అంతరంగంలో ఆ మూలుగు తాలూకు జ్ఞాపకాలు కదలాడేలోపునే సైకిల్ ఆ ఇంటిని దాటి వెళ్ళింది. ఇంటి ఆఖరి అంగుళం దాటినప్పటికీ ఆ మూలుగు వినిపిస్తూనే వుంది. కొద్ది దూరం వెళ్ళిన కామేశానికి తనకు తెలియకుండానే ఆగాలనిపించింది. ఆగిపోయాడు కూడా.

ఆ ఇంటికి అటు ఇటు కొంత దూరం వరకు ఇళ్ళు లేనట్టుంది. ఆ మూలుగు తనకి బాగా తెలుసు.

అమ్మతనం కడుపు తెగుతున్నప్పుడు అంగాంగమూ మెలికలు తిరిగిపోతూ అసహాయతను అదుముకునేందుకు ప్రేగులు తెగే పురిటి నొప్పులకు సూలింతలు చేసే ఆర్తనాదం అది. కామేశం తన భార్య రాజ్యం రెండవసారి కాన్పుకి పడిన బాధలు ప్రత్యక్షంగా చూశాడు. ఏడవ నెలకే భార్యకు కాన్పు రాగలదని ఊహించలేక ఎవరినీ ఏర్పాటు చేసుకోలేక పోయాడు. దిక్కుతోచని స్థితిలో తాను ఆనాడు భార్య బాధలు చూడలేక పడిన అవస్థ, ఆదుర్దా, అంతా ఇంతా కాదు. ఆ బాధ శత్రువుకి కూడా రాకూడదనుకున్నాడు. దేవుడు చల్లగా చూసి ఆసుపత్రికి వెళ్ళకుండానే రాజ్యానికి సుఖప్రసవం జరిగింది. ఆలాంటి సమయంలో వచ్చే మూలుగే ఇప్పుడు వినిపించింది.

## పదునైన ఆయుధం!

'అతి పదునైన ఆయుధానికి మించిన ఆయుధం ఏదైనా ఉందా అనంతమూర్తిగారు?' అని ఒక సన్నిహితుడు, ప్రముఖ కన్నడ రచయిత, జ్ఞానపీఠ్ బహుమతి గ్రహీత అయిన యు.ఆర్.అనంతమూర్తిని అడిగాడు.

'ఉంది! అదే మన నాలుక! దానికి ఎటువంటి ఎముకలూ లేకపోయినా, తన సూటిమాటలతో ఎన్ని గుండెలయినా బదలు చేస్తుంది!' అన్నారు అనంతమూర్తి.

—కొడిమెల శ్రీరామమూర్తి

అయితే ఆ మూలుగుతోపాటు మరింకేదో నిస్సహాయత అందులో ధ్వనించి ప్రమాదాన్ని సూచిస్తున్నట్టు తోచటంవల్లే కామేశానికి అక్కడ ఆగాలని అనిపించి ంది.

వెళ్ళి ఆ ఇంటి తలుపు తట్టాడు కామేశం. మూలుగుతప్ప ఎలాంటి సమాధానమూ లేదు. ఇంట్లో ఎవరూ తోడు లేరేమో అన్పించింది. అంతలోనే చిన్నగా గురక వినిపించింది.

'ఎవ్రా ఇంట్లో' పోలీసు గొంతుతో పిలిచాడు కామేశం.

"ఎ...వ...రూ" బాధను పళ్ళ బిగువన నొక్కిపట్టి ఆ ఇంటి ఇల్లాలు ఇచ్చిన సమాధానంలో మనిషి సహాయం. అవసరమనిపించేలా ధ్వనించింది. గట్టిగా తలుపుని నెట్టాడు కామేశం. పూరింటిలో దీపం కూడా లేక అంతా చీకటిగా వుంది లోపల. తన దగ్గర అగ్గిపెట్టె పెట్టుకునే అలవాటు లేదు. గొంతు హెచ్చించి "ఇంట్లో ఎవరూ లేరా...నొప్పలా ఏమిటి" అడిగాడు కామేశం.

"బాబూ ఎవరో దేవుడిలా వచ్చావ్...ఆ సచ్చినోడు తాగి పడున్నాడు. నొప్పులు భరించలేక పోతున్నాను. అమ్మా..." ఒక్కసారిగా చీకట్లోనే బావురమని ఏడ్చి వెక్కిళ్ళు పెట్టిన శబ్దం. అంతవరకు ఆమె పడిన బాధ గురించి పట్టించుకున్న వాళ్ళే లేక ఒంటరితనంతో ఏడుపుని అదిమి పెట్టుకుంది.

"అగ్గిపెట్టెక్కడుందీ...ఎవరినన్నా దగ్గరుంచుకోకూడదూ" మాటలు వినిపించిన వైపు తలుపుల దగ్గర నిలబడి అన్నాడు కామేశం.

"నా చేతి దగ్గరే ఉందయ్యా...లేవలేక పోతున్నా" అగ్గిపెట్టె మోగించిందామె. శబ్దం వచ్చిన వైపు జాగ్రత్తగా వెళ్ళాడు కామేశం. కాళ్ళకేదో మెత్తగా అడ్డువస్తే తప్పించుకుని అగ్గిపెట్టె అందుకుని వెలిగించాడు., ఆ వెలుతురులో కనిపించిన దృశ్యానికి కామేశం హృదయం కరిగి నీరయింది. ఆ అమ్మాయికి విపరీతంగా రక్తస్రావం అవుతోంది. మృత్యువు ఆమె చుట్టూ ఆవరించినట్టు గోడకు చేరగిలబడి గిలగిలలాడుతోంది. అగ్గిపుల్ల వెలుగులోనే దీపం వెతికి వెలిగించాడు. ఆమె భర్త కనిపించాడు.

దొంగసారా మత్తులో చిత్తుగా మునిగి సోయ లేకుండా పడివున్నాడు. భార్య ప్రసవంతో మరణంతో కుస్తీ పడుతుంటే కనీసం గమనించే స్థితిలో కూడా లేడు. కామేశానికి కడుపు రగిలిపోయింది. సారా వ్యసనంతో నిండు చూలాలు యింట్లో వున్నదనే ఇంగితం కూడా లేకుండా పశువులా ఆమె మానాన ఆమెని వదిలి గురకపెట్టి నిద్రపోతున్న వాడిని చూసి కోపంతో కామేశం సాచిపెట్టి బూటుకాలితో నడ్డిమీద ఈడ్చి తన్నాడు. అయినా వాడికి చీమకుట్టినట్టు కూడా లేదు. కొద్దిగా కదిలి అటు తిరిగి పడుకున్నాడు. మరింకా ఆమె మూలుగులు బాధ వాడికెక్కడ ఎక్కుతాయి.

ఆ తల్లి బట్టలు రక్తంతో ముద్దయిపోయాయి. ఏమీ చేయలేక వెక్కెక్కి ఏడుస్తూ 'వాడ్ని కొట్టకండయ్యా' అంటోంది. బాధ పెరిగిపోతుంటే "అన్నా నన్ను బతికించు" రెండు చేతులూ ఎత్తి కామేశానికి దణ్ణం పెట్టింది. కామేశం కడుపు తరుక్కుపోయింది. మానవత్వం ముకుళించి డ్యూటీ సంగతి మరిచాడు. అనవసర విషయాల్లో తలదూర్చటానికి ముందుండే ఇరుగు పొరుగు మనుషులు పాటి మనిషి బాధల్లో ఉంటే కంటికి కనిపించరు.

"నీకేం ఫరవాలేదమ్మాయ్...ఎవరినన్నా పిలుచుకొచ్చి ఆసుపత్రికి పంపిస్తాను ఖంగారు పడకు" అంటూనే బయటకొచ్చాడు. ఆమాత్రం భరోసా చాలన్నట్టు వెక్కుతూనే వుందామె.

దూరంగా ఇళ్ళల్లో పడుకున్న వాళ్ళని కేకలేసి లేపాడు. చేతిలోని లాఠీతో తలుపుల మీద బాది వదిలాడు.

ఆడవాళ్ళంతా కొంగులు బిగించి నొప్పులు పడుతున్న నీలవేణి గుడిసెలో కెళ్ళారు. ఇద్దరు మగాళ్ళు తాగి పడున్న ఆమె భర్త రంగడ్ని

ఈడ్చి బయట పడేశారు. ఏమీ తొయ్యని మిగిలిన వాళ్ళు ఎలా పోగేశారో చెత్తా చెదారంతో చలిమంట అంటించారు.

కామేశానికి ఇక తను చెయ్యాల్సింది ఏమీ లేదనిపించింది. డ్యూటీ గుర్తొచ్చి వెళ్ళిపోదామని బయలుదేరుతుండగా నీలవేణిని ఆసుపత్రికి తీసుకు వెళ్ళాలని చెప్పారు. ఆ సందుల్లోకి రిక్షా కోసం వెళ్ళి రావటం చాలా సమయం పడుతుంది.

కామేశం ఆదేశంతో మలక మంచాన్ని తిరగేసి వెంటనే 'సవారీ' కట్టి మగాళ్ళు మోసేందుకు సిద్ధపడ్డారు. గవర్నమెంటు ఆసుపత్రిలో అయ్యవార్లు మాట వినరని కామేశమే రావాలని అనటంతో సవారీతోపాటు బీటు విడిచి వెనక్కిమళ్ళాడు.

అంతా ముగిసేసరికి తెల్లవారబోతోంది. స్టేషను కెళ్ళేందుకు సైకిలెక్కాడు కామేశం. నీలవేణికి కవల పిల్లలు పుట్టారని కబురు అందించారు. కామేశం మనసు ఎందుకో చాలా సంతృప్తిగా సంతోషంతో నిండిపోయింది. తన బాధ్యత తీర్చినట్టు హృదయం వికసించింది. ఎర్రబడిన కళ్ళతో స్టేషన్‌కెళ్ళి బీటు బుక్కు ఇచ్చివేసి కామేశం ఇంటికెళ్ళిపోయాడు. భార్య కాచిన వేడి నీళ్ళతో తలారా స్నానంచేసి పడకేశు.

రెండు గంటల్లోనే 104 సుబ్బారావు వచ్చాడని ·ర్య కామేశాన్ని నిద్రలేపింది.

కామేశం వెళ్ళాల్సిన రెండవ బీటు ప్రాంతంలో దొంగలు పడ్డారట. సరిగ్గా అర్థరాత్రి రెండు గంటల ప్రాంతం. పోలీసు బీటు కొస్తే ఆ సంఘటన జరిగేది కాదని అధికారులు ధృవీకరించారు. కానిస్టేబుల్ కామేశానికి మొదటి మెమో ఇస్తూ సస్పెండ్ చేయాలని భావిస్తున్నట్టు 104 సుబ్బారావు బాధగా చెప్పి వెళ్ళాడు.

అయినా కామేశానికి బాధ వెయ్యలేదు. దొంగలు దోచుకోగా పోతే వెయ్యి... పది వేలు...లక్ష... కాని మనిషి ప్రాణం పోతే. ఆ తల్లితోపాటు గర్భంలోని మరో రెండు చిన్ని చిన్ని ప్రాణాలు పోయివుంటే...? మంచంపై పడుకువే ఆలోచించి తవలో తాను నవ్వుకున్నాడు. పిల్లలు స్కూలుకు వెళ్ళిపోయారు. భార్యను పిలిచి విషయం చెప్పాడు. మెమో గురించి ఆమె గొణిగింది. ముసి ముసిగా నవ్వాడు తన బాధ్యత నిర్వర్తించినందుకు తృప్తిగా. ●

# పెద్దపిట్టలు

వెలి ముఖాల కింద
స్లాబైన సరస్వతి
బుగ్గైన గుడిసెల్ని
వీణ మీద కూర్చుకుంటుంది.

వడుకుతుంది
'పోగులు పోగులు'గా
'కనుపాపల్లో' తెంచుకున్న పేగుల్ని.

మెట్లే ఎరుగని జాతి మీద
మీకు 'పాదాల కింది నించి'
'ముఖాల దాకా' లిఫ్టులు.

ఎటునుంచి దారిని 'కత్తి'రిస్తున్నారో
అడుగులు పడకముందే
అగాధాల ఆవిష్కరణ

ఇక దారి మీద దాపరికమెందుకు?
ఎన్ని పిడికిళ్ళ ఆత్మగౌరవాలు
మూట కట్టుకొని పోతున్నారో- చెప్పరా!

గాయాలు ఒలికే
ఎన్ని గుండెల్ని
అలుకుపిడిసెగా
వాడుకుంటున్నారో.

వెలివాడల్లో మైలకూడును
ముద్దలుగా పిసుకుతూ
ఎన్నెన్ని మిద్దెలల్లుతున్నారో.

కవి, రచయిత, సాహితీవేత్త
తత్వవేత్త, నాయకుడు
ఒక్క మొహం మీదే ఎన్ని ముడిగెలు.

వ్యాపార ప్రపంచంలోకి
విగ్రహాల కింది నించి
సొరంగ మార్గం తెలుసు. వీళ్ళకి

వర్ణం కింద చెమ్కీలు
అద్దుకున్న ఈ మొహాలు
ఏ చీకటివాడల్లోని లాంతర్లో.

రాజకీయ విరామంలో
పాటలు నేర్చుకున్న మాటల్ని
'పల్లీకాయల్లా' వొలుచుకుంటున్న మీరు
మా మీదకి పాకుతున్న 'జంధ్యాలే'!

ఇక ఈ ఘడియ మీది నించి
లేవకపోతే
గతం 'కులపక్షి'లా వేలాడుతుంది.

లోతట్టు నుంచి పెల్లుబికే స్వరాలకు
కుప్పకూలి పోవాల్సిందే
వాడల మీద వాలిన 'పెద్ద పిట్టలు'

(దళితుల్లోని దళారులకు...)

– ఎం.వెంకట్

